2000 ఎకరాలకు.. 200 యూరియా బస్తాలా?

- ఇలాగైతే పంటలు ఎలా సాగు చేసుకోవాలి..
- రైతులంటే ప్రభుత్వానికి అలుసు తగదు
- ఆర్డీఓ ఎదుట పెంట గ్రామ రైతుల ఆవేదన


ఆర్డీఓ సాయిప్రత్యూష వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న పెంట గ్రామ రైతులు

జి.సిగడాం: 'మా పెంట సచివాలయం పరిధిలో పెంట, నాగులవలస, వి.ఆర్.పేట గ్రామాలు ఉన్నాయి. సుమారు రెండు వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాం. మా పొలాలకు సుమారు రెండు వేల బస్తాల యూరియా అవసరం. ప్రభుత్వం మాత్రం కేవలం రెండు వందల యూరియా బస్తాలు మాత్రమే పంపించింది. ఇన్ని తక్కువ బస్తాలతో ఎలా సాగు చేసుకోవాలి' అంటూ స్థానిక రైతులు పున్నాన అక్కలనాయుడు, మక్క నారాయణరావు, మీసాల లక్ష్మణరావు, మక్క శ్రీనివాసరావు శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయిప్రత్యూష ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పెంట గ్రామాన్ని ఆర్డీఓ సందర్శించారు. సోమవారం నుంచి యూరియా బస్తాలు పంపిణీ చేయనున్న నేపథ్యంలో ఎటువంటి తగాదాలు జరగకుండా ముందస్తు చర్యలపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆర్డీఓను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. వరి సాగు ప్రారంభించి రెండు నెలలైనా ఇంత వరకు యూరియా లేక కళ్ల ముందే పంటలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట దిగుబడికి యూరియా తప్పనిసరిగా వేయాల్సి ఉంటుందన్నారు. రెండు వందల బస్తాలు ఏమాత్రం సరిపోవని, తక్షణమే పూర్తిస్థాయిలో రైతులకు సరఫరా చేయాలని కోరారు. ప్రస్తుతానికి కేటాయించిన రెండు వంద బస్తాల యూరియాను ఎటువంటి తగదాలు లేకుండా తహసీల్దార్, పోలీస్ బందోబస్తు మధ్య పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాధికారి జీవన్‌చంద్రన్, తహసీల్దార్ మహాదేవు సరిత, ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, ఏఓ బెండి బాబ్జీ, వీఆర్‌ఓ భూపతి నర్సింగరావు, సీతయ్య, నీలకంఠం, సింహాద్రి విజయశంకర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ తలచింతల కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో విస్తృత తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న తహసీల్దార్ సరిత

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలో పలు ఎరువుల దుకాణాల్లో తహసీల్దార్ మహాదేవు సరిత ఆదివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి రైతుకు యూరియా అందిస్తామన్నారు. రైతులు ఎరువు తీసుకెళ్లేటప్పుడు తప్పనిసరిగా రశీదు పొందాలన్నారు. గొడౌన్ వద్ద ఎరువులు తీసుకువెళ్తున్న వారికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు నోటీసు బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. లైసెన్సు లేకుండా ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఆమెతోపాటు వీఆర్‌ఓలు భూపతి నర్సింగరావు, కుప్పిలి సీతయ్య, ముద్దాడ నీలకంఠ, సిబ్బంది ఉన్నారు.

అడ్డగోలు అమ్మకాలపై ఆగ్రహం


ఎరువుల దుకాణాలు పరిశీలిస్తున్న ఆర్డీవో

రణస్థలం: రైతుల వివరాలు లేకుండా ఎరువులను ఎలా సరఫరా చేస్తారని, ప్రైవేటు ఎరువుల దుకాణంపై పర్యవేక్షణ లేకపోతే ఎలా అని వ్యవసాయ అధికారులపై శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష ఆగ్రహం వ్యక్తం చేశారు. లావేరు మండలం వెంకటాపురంలో ప్రయివేటు ఎరువుల దుకాణాలను ఆర్డీవో తనిఖీ చేశారు. రైతుల వివరాలు నమోదు చేసుకోకుండా తెలుపు కాగితంపై రాసి ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు యూరియా అమ్మకాలు, నిల్వలు రికార్డులు పరిశీలించారు. ఈ పాస్ యంత్రాలు ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే యూరియా అమ్మకాలు జరపాలన్నారు. మండల వాసులకు తప్ప ఇతర ప్రాంతవాసులకు యూరియా అమ్మకాలు జరపరాదని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే యూరియా అమ్మకాలు చేపట్టాలని, అడ్డగోలు అమ్మకాలు జరిపితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలిశెట్టి గూడెం రైతు సేవా కేంద్రంలో ఎరువుల కోసం రైతులు ఒకేసారి లోపలకు వెళ్లడంతో తోపులాట చోటుచేసుకుంది. అధికారులు సముదాయించి క్యూపన్లు అందించి ఒక్కొక్కరికి యూరియా సరఫరా చేశారు. కార్యక్రమంలో ఏవో మహేష్ నాయుడు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


జి.సిగడాం మండలం బాతువ గ్రామంలో అధికారులను నిలదీస్తున్న రైతులు


శ్రీకాకుళం రూరల్: వప్పంగి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కూపన్ విధానంలో ఎరువుల పంపిణీ

రణస్థలం: రైతులకు ఇబ్బంది కలగకుండా కూపన్ విధానంలో ఎరువులు పంపిణీ చేస్తామని, రైతులు సహకరించాలని రణస్థలం వ్యవసాయాధికారి డి.విజయభాస్కర్ అన్నారు. రణస్థలం మండలం బంటుపల్లి, వల్లభరావుపేట రైతు సేవా కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ఒక పంట కాలంలో 25 కేజీల చొప్పున మూడు దపాలుగా 75కేజీల యూరియా వేయాలని రైతులకు సూచించారు. పంటలో చీడ పీడల ఉధృతి గత సంవత్సరం కంటే తక్కువ ఉందన్నారు. ప్రయివేటు దుకాణాల్లో యూరియా ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయించాలన్నారు.


బంటుపల్లిలో యూరియా అమ్మకాలు పరిశీలిస్తున్న ఏవో విజయభాస్కర్

క్లుప్తంగా

నిత్యావసర సరుకుల వితరణ


నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: సమాజ సేవా కార్యక్రమాలలో రోటరీక్లబ్ ముందంజలో ఉంటుందని రోటరీక్లబ్ జిల్లా అధ్యక్షుడు బరాటం శ్రీనివాసరావు అన్నారు. వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కేసీ గుప్తా జయంతి సందర్భంగా క్లబ్ కార్యాలయంలో ఆదివారం పేద ఆర్యవైశ్య వృద్ధులకు నిత్యావసర వస్తువులు వితరణ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ పేర్ల మహేష్, జిల్లా వైస్ గవర్నర్ పసుమర్తి అప్పలరాజు, ఐపీసీ పేర్ల కామరాజు, జిల్లా అధికారి మామిడిపాక సుధాకర్, అధ్యక్షులు మాటూరు దీపక్, కార్యదర్శి మణికొండ రవి, కోశాధికారి గ్రంధి నాని, వనిత క్లబ్ అధ్యక్షులు మామిడిపాక పద్మావతి, కార్యదర్శి మాటూరు మౌనిక, కోశాధికారి మణికొండ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో మంత్రి కొల్లు


మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర ఎక్సైజ్, మైన్స్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం మంత్రి సౌర హోమం చేయించుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గొండు శంకర్ మంత్రికి స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్: నేత్రదానం చేసి మరొకరికి కంటిచూపును ప్రసాదించాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు బరాటం శ్రీనివాస అన్నారు. 40వ జాతీయ పక్షోత్సవాల సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రోటరీ క్లబ్ శ్రీకాకుళం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని సిద్ధార్థ పాఠశాల ఆవరణలో నేత్రదానంపై అవగాహన అవగాహన కల్పించారు. అనంతరం ఆప్తాలమిక్ అధికారి ఎంఆర్‌కె దాస్ నేత్ర పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు బరాటం శ్రీనివాస్, క్లబ్ సెక్రటరీ కిల్లాన శ్రీనివాసరావు, క్లబ్ ఉపాధ్యక్షులు బమ్మిడి సందీప్, స్కూల్ కరస్పాండెంట్ నాతాడ వెంకటరావు, రోటరీ ప్రతినిధులు జైశ్రీరామ్, పసగడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు ఒక ప్రకటనలో కోరారు. రాజకీయ జోక్యంతో సీట్లు కేటాయించడం తగదన్నారు. వ్యవస్థ ఇలా ఉంటే వీటిలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. ఒక్కొక్క కేజీబీవీలో 25 మంది వరకు సిబ్బంది ఉన్నారని, వీరంతా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో తక్కువ జీతానికి పనిచేస్తున్నారని తెలిపారు. ఇటువంటి వారికి జీతాలు పెంచకపోగా, ఇష్టారాజ్యంగా బదిలీలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల తరహాలోనే బోధనా సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు.

సేవాభావం అవసరం

శ్రీకాకుళం కల్చరల్ : విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.వేణుగోపాల్ అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని బెహరా మనోవికాస కేంద్రంలో ఆదివారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసరాల శుభ్రత, మొక్కలు నాటడం, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ సుగుణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్.మోహనరావు పాల్గొన్నారు.

ఆంధ్ర కవితా పితామహుడు పెద్దన


నాగేంద్రను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దన కవి సార్వభౌముడని విశ్రాంత తెలుగు పండితుడు వి.వి.నాగేంద్ర అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో 'అల్లసానివారి అల్లిక జిగిబిగి' అనే అంశంపై ఆదివారం ప్రవచనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు పెద్దన కవిని గండ పెండేరంతో సత్కరించిన విధానం పద్యాన్ని వివరించారు. వర్ణనలు చెప్పడంలో దిట్ట అని హిమాలయ పర్వతం వర్ణన వినిపించారు. అనంతరం వక్తను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మందిరం నిర్వాహకులు డాక్టర్ కోమలరావు, ఎం.శ్రీనివాసరావు, మురళీకృష్ణ, పట్నాయిక్, స్వామి, ప్రసాద్, గోవిందరావు, నారాయణమూర్తి, వెంకటరమణ, అరుణకుమారి, సరస్వతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జిపురాన్ని మండల కేంద్రంగా చేయాలి


సమావేశంలో పాల్గొన్న బెజ్జిపురం గ్రామస్తులు

రణస్థలం: లావేరు మండలం బెజ్జిపురం గ్రామాన్ని మండల కేంద్రంగా చేయాలని గ్రామస్తులంతా ఏకతీర్మానం చేశారు. ఈ మేరకు ఆదివారం బెజ్జిపురం మార్కెట్ యార్డ్ పరిధిలో సుమారు 200 మందితో భారీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఆదపాక, గుర్రాలపాలెం, పెద్ద కొత్తపల్లి, కొత్తకుంకాం, పాతకుంకాం, పైడయ్యవలస, చిన రొంపివలస, తామడ, లక్ష్మీపురం, బుడతవలస, గ్రామాలను కలుపుకుని బెజ్జిపురం గ్రామాన్ని మండల కేంద్రంగా చేయాలని తీర్మానించుకున్నారు. ఇందుకు 15 గ్రామాల మద్దతు తీసుకుని సోమవారం జిల్లా కేంద్రంలో 30మందితో కలెక్టర్ గ్రీవెన్సులో వినతి పత్రం అందజేయనున్నామని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, బెజ్జిపురం యూత్ క్లబ్ అధ్యక్షుడు మేడూరి ప్రసాదరావు, బిజెపీ జిల్లా కార్యదర్శి ఇజ్జాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ముంజూరు'కు విశిష్ట ఆదరణ


పుస్తక పరిచయం చేస్తున్న తెరవే సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: 'ముంజూరు' కవితా సంకలనానికి విశిష్ట ఆదరణ లభించిందని ఎస్‌బీటీ ఫౌండర్ దుప్పల రవికుమార్ అన్నారు. ఆదివారం తెరవే నెలవారీ కార్యక్రమంలొ భాగంగా 'ముంజూరు' కవితా సంకలనం పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో అలరారుతున్న కళింగ సీమ కవుల కవితా గానమే ముంజూరు కవితా సంకలనమని పేర్కొన్నారు. తెరవే అధ్యక్ష కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి మాట్లాడుతూ కళింగసీమలోని 72 మంది రచయితలకు స్థానం కల్పించడంతో పాటు సింహభాగం రచయితల ప్రాంతీయ మాండలికంలో కవితలు రాయడం వినూత్న పరిణామంగా భావించవచ్చన్నారు. అనంతరం స్వీయ కవితా గానం చేశారు. కార్యక్రమంలో రచయితలు బి.మోహన్ గాంధీ, జంధ్యాల శరత్‌బాబు, వి.కొండలరావు, లలితా రెడ్డి, ఎల్.సత్యానంద్, డి.చిరంజీవి, కె.సత్యం, పత్తి సుమతి, కిల్లాన శ్రీనివాసరావు, తెప్పల కృష్ణమూర్తి, చింతాడ కృష్ణారావు, వాడాడ శ్రీనివాసరావు, కె.పేర్రాజు, నిక్కు అప్పన్న, ఇద్ది పాపయ్య, పి.వి.దుర్గాప్రసాద్, ఎం.ఉపేంద్రశర్మ, ఉమాకవి, ఈశ్వరరావు, తులాల నవరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుల నియామకం

జి.సిగడాం: మండలం పరిధిలో 31 గ్రామ పంచాయతీలకు వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షులు నియమితులయ్యారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరావు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా టెక్కలి ఆదినారాయణ(వాండ్రంగి), చిత్తిరి మోహన్(ఆనందపురం), వడిశ మహేశ్వరరావు (దవళపేట), బాలబొమ్మ శ్రీనివాసరావు(సంతవురిటి), గోవిందరావు(పాలఖండ్యాం), టంకాల రామకృష్ణ(టిడివలస), బైరెడ్డి విష్ణు(సీతంపేట), పున్నాన పాపినాయుడు(పెంట), బత్తుల చంద్రశేఖర్(నాగులవలస), విక్రం కోటేశ్వరరావు(మద్రివలస), డకర నాగరాజు(మెట్టవలస), మహాదాస్యం నాగేశ్వరరావు(గొబ్బూరు), శాసపు శ్రీరాములు(నిద్దాం), నల్లి తవిటినాయుడు (మధుపాం), గొలుసుపూడి సింహచలం (కప్పరాం), కిలారి మిన్నారావు(చెట్టుపొదిలాం), బొల్లా జగన్నాథరావు (వెలగాడ), తిరుమరెడ్డి లక్ష్మణరావు (దేవరవలస), ఇప్పిలి త్రినాథరావు (సేతుభీమవరం), బాలి లక్ష్మణరావు(నడిమివలస), కంది రమాదేవి(ఎస్‌పిఆర్‌పురం), గొద్దు మహేశ్వరరావు (ఎందువ), పంచిరెడ్డి వైకుంఠరావు (గెడ్డకంచరాం), పల్లేడ సన్యాసిరావు (బాతువ), పిన్నింటి సత్యంన్నాయుడు(పున్నాం), కుమరాపు శ్రీనివాసరావు (డిఆర్‌వలస), చందక ఈశ్వరరావు(ముషినివలస), పెద్ది శ్రీనివాసరావు (జాడ), తిరుమరెడ్డి చిన్నారావు (జగన్నాథవలస), మామిడి శ్రీనివాసరావు (వెంకయ్యపేట), సువ్వాడి చండీప్రసాద్(జి.సిగడాం)లను కిరణ్ అభినందించారు.

ముగిసిన చాతుర్మాస దీక్ష

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పరిసరాల్లో విశాఖ శ్రీ సౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి శ్రీరామానంద భారతి స్వామీజీ చాతుర్మాస దీక్ష చేపట్టి ముగించడం ఇక్కడి వారి అదృష్టమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్వామీజీ ఈ ఏడాది జూలై 10 నుంచి చేపట్టిన చాతుర్మాస దీక్ష ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామీజీని కలుసుకుని ధర్మపరిపాలన, హిందూ ధర్మ పరిరక్షణ అంశాలపై చర్చించారు. చాతుర్మాస దీక్ష లక్ష్యాన్ని స్వామీజీ వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, డివిజన్ ఇన్‌ఛార్జి ఉంగటి రమణమూర్తి, తెలుగు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాలికల ఆరోగ్యమే సమాజ భవిష్యత్తుకు పునాది అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. చిన్న వయసులోనే సరైన పరీక్షలు, అవగాహన కల్పిస్తే రేపటి తరాలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని బాలికల హాస్టల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకాకుళం ప్రసూతి, గైనకాలజిస్టుల సంఘం - ఫ్రీమాన్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా చేపట్టిన పి-4 కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 98 మంది బాలికలకు అనీమియా స్క్రీనింగ్, రక్తగ్రూప్ పరీక్షలు, గైనకాలజి వైద్యపరీక్షలు, బాడీ మాస్ ఇండెక్స్ రికార్డింగ్ నిర్వహించారు. ఉచితంగా శానిటరీ న్యాప్కిన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ అనిత, డీసీహెచ్ఎస్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, గైనిక్ విభాగ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ అరవింద్, డాక్టర్ పార్వతీ, డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్సీ వసతి గృహంలో కలెక్టర్, ఎమ్మెల్యే చేతులమీదుగా మొక్కలు నాటారు.

ఆలయాలు మూసివేత


నారాయణ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం మూసివేస్తున్న దృశ్యం


ఉమారుద్రకోటేశ్వర స్వామి దేవాలయం మూసివేస్తున్న దృశ్యం


పాలకొండ రోడ్డులోని కోదండరామాలయం మూసివేత

అరసవల్లి/శ్రీకాకుళం కల్చరల్: చంద్ర గ్రహణం నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆలయాలు మూసివేశారు. ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయం ప్రధాన ద్వారం తలుపులను ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభమవుతాయని ఈవో ప్రసాద్ తెలిపారు. గుడివీధిలోని ఉమరుద్ర కోటేశ్వరస్వామి దేవాలయాన్ని సోమవారం వేకువజాము ఉదయం 4 గంటలకు సంప్రోక్షణ హోమపూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అనుమతిస్తామని ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి తెలిపారు. ఫాజుల్‌బాగ్‌పేటలోని నారాయణ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, పాలకొండ రోడ్డులో ఉన్న కోదండరామాలయం, కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం, పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయం తదితర దేవాలయాలన్నీ మధ్యాహ్నం నుంచి మూసివేశారు.

దేశ నాయకుల జీవితం స్ఫూర్తిదాయకం



విద్యార్థులు తరగతి పుస్తకాలకే పరిమితం కాకుండా గ్రంథాలయానికి వచ్చి రకరకాల పుస్తకాలను చదువుకోవచ్చని, జాతీయ నాయకుల జీవిత చరిత్ర చదివి స్ఫూర్తి పొందాలని లావేరు శాఖా గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం లావేరు శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా దేశ నాయకుల జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు. - ఎచ్చెర్ల

అధ్వానంగా గ్రామీణ రోడ్లు



పల్లె రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కొద్దిపాటి చినుకులుకే చిత్తడిగా మారుతున్నాయి. రైతులు పొలాల నుంచి పంటలను ఇంటికి తెచ్చుకునేందుకు, ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లేందుకు ఈ రహదారులనే ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ముద్దాడ, అజ్జరాం, ఫరీదుపేట, గాడుపేట, క్యొయ్యాం తదితర గ్రామాల్లో ఇటువంటి రహదారులు దారుణంగా మారాయి.

- ఎచ్చెర్ల

అన్నదానం..లడ్డూ వేలం



లావేరు మండలం మురపాక పంచాయతీ ప్రతిభాభారతి నగర్ కాలనీలో వినాయక నవరాత్రులు ముగింపు సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. సుమారు 1500 మంది హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం మహాలడ్డు వేలం వేయగా అదే కాలనీకి చెందిన నాలి రామకృష్ణ దంపతులు రూ.65 వేలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. - ఎచ్చెర్ల